చేనేతకు చేయూత



అంగరలో మగ్గంపై చీర నేస్తున్న నేత కార్మికురాలు

సహకార సంఘం	సభ్యుల సంఖ్య	4వ విడత సాయం	5వ విడతసాయం
మండపేట	294	122	123
ఏడిద	212	57	55
రాయవరం	160	50	55
అంగర	711	282	299
నల్లూరు	400	111	121
నేలటూరు	370	223	240
హసనబాద	400	133	136
ఆదివారపుపేట	802	257	268
అద్దంపల్లి	341	124	145
శివల	180	38	48
కాజులూరు	169	89	95
మొత్తం	4,039	1,486	1,585

- చేనేత కార్మికులకు ఐదో విడత నేతన్న నేస్తం
- రెండు నియోజకవర్గాల్లో 1,585 కుటుంబాలకు లబ్ధి

కపిలేశ్వరపురం: చరిత్రలో గుర్తింప తగిన వృత్తి చేనేత. తరతరాలుగా నేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలు ఆధునికత నేపథ్యంలో భారంగా మారాయి. రెడీమేడ్ సంస్కృతితో నేత వస్త్రాల తయారీ ప్రమాదంలో పడింది. వృత్తి పరిస్థితులు ఎలా ఉన్నా వృత్తిని నమ్ముకున్న నేత కార్మికుల కుటుంబాల పోషణ బాధ్యతను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్నారు. గత ప్రభుత్వాలేవీ చేయని ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఆదుకుంటూ వస్తోంది. శుక్రవారం ఐదో విడతగా ఒక్కో కుటుంబానికి రూ.24 వేలు చొప్పున 1,585 కుటుంబాలకు రూ.3,80,40,000 చొప్పున లబ్ధిదారుల ఖాతాకు జమ చేసింది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 12 చేనేత సహకార సంఘాలు ద్వారా 4,039 మంది సభ్యులున్నారు. ఆయా సంఘాలు రూ.8,55,00,000 టర్నోవర్ వ్యాపారం సాగుతోంది. వీటికి తోడు ప్రైవేటు మాస్టర్ వీవర్సు ద్వారా మగ్గాలపై వస్త్రాల తయారీ సాగుతోంది.

'నేతన్న నేస్తం' పథకంతో ఆర్థిక సాయం

నేతన్న కుటుంబానికి నెలకు రూ.రెండు వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని 2019 డిసెంబర్ 21న ప్రారంభించి తొలి విడతగా కుటుంబానికి రూ.24 వేలు చొప్పున జమ చేసింది. రెండో విడత 2020 డిసెంబర్‌లో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కరోనా కష్టాల్లో ఉన్న నేతన్నలను ఆదుకునేందుకు 2020 జూన్ 20నే సాయమందించింది. 1వ, 2వ విడతల్లో రామచంద్రపురం నియోజకవర్గంలో 689, మండపేట నియోజకవర్గంలో 785 మొత్తం 1,474 మందికి రూ.48 వేలు ఆర్థిక సాయమందించింది. మూడో విడత సాయాన్ని 2021 ఆగస్టు 9న మండపేట నియోజకవర్గంలో 852 మందికి, రామచంద్రపురం నియోజకవర్గంలో 616 మందికి మొత్తం1,468 మందికి రూ.24 వేలు చొప్పున సాయమందించింది. నాలుగో విడత 2022 ఆగస్టు 28న 1,486 మందికి రూ.3,56,64,000 పంపిణీ చేయగా ఐదో విడతగా ఈనెల 21న 1,585 మందికి రూ.3,80,40,000 పంపిణీ చేశారు. 4వ విడత లబ్ధిదారులకంటే ఐదో విడతలో 99 మందికి రూ. 23,76,000 అదనంగా సాయం చేశారు.

పాలనా కాలం పూర్తికాకుండానే..



తన పాలన పూర్తయ్యే ఐదేళ్ల లోపు ఏడాదికి రూ.24వేలు చొప్పున సాయం చేస్తానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు హామీ ఇచ్చారు. ఆయన పాలనాకాలం ఐదేళ్లు పూర్తికాకుండానే ఐదు విడతల సాయాన్ని పంపిణీ చేశారు. చేనేత చరిత్రలో ఇలాంటి సాయం ఏ ప్రభుత్వమూ చేయలేదు.

– దొంతంశెట్టి సత్యప్రకాష్, చైర్మన్, చేనేత సహకార సంఘం, హసనబాద, రామచంద్రపురం రూరల్ మండలం

క్రమం తప్పని సాయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి విడతగా 2019లో రూ.24వేలు సాయం చేశారు. అప్పటి నుంచి హామీ మేరకు ఐదు విడతలుగా సాయం అందజేస్తూనే ఉన్నారు. కరోనా కాలంలో ఆరు నెలలు ముందే సాయం జమ చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– అతికెల శంభులింగం, నేత కార్మికుడు, నల్లూరు

సమాజ హితుడు 'చల్లా'



చల్లా వెంకట్రావుకు నివాళి అర్పిస్తున్న స్టాలిన్ తదితర ప్రముఖులు

మండపేట: ప్రముఖ హోమియో వైద్యుడు, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చల్లా వెంకట్రావు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన మహనీయుడని ఆయన 15వ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. పట్టణంలోని నాళంవారి సత్రంలో సంగమం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, సంగమం వేదిక నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహర్ ప్రసన్న, సాంస్కృతిక వేదిక నాయకుడు కట్టా కృష్ణారావు, ఉపాధ్యాయ, ఉద్యోగ, శ్రామిక సంఘాల నాయకులు చల్లా వెంకట్రావు కృషిని గుర్తు చేశారు. నిర్వాహకులు రవికుమార్ మాట్లాడుతూ తీవ్ర సంక్షోభంలో నడుస్తున్న మానవ సమాజాన్ని మెరుగైన స్థితికి మార్చే లక్ష్యంతో వైజ్ఞానిక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజా కళాకారులు ప్రేమానందం పాడిన పాటలు అలరించాయి.

క్లుప్తంగా

అమెరికా అమ్మాయి గాత్ర కచేరీ



గాత్ర కచేరీతో అలరించిన చిన్నారి హృద్యను సత్కరిస్తున్న ఈఓ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమెరికా చిన్నారి సోమవారం తన గాత్ర కచేరీతో భక్తులను మైమరిపింపజేసింది. ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటున్న ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లికి చెందిన గనిశెట్టి శివన్నారాయణ, శ్రీదేవిల కుమార్తె అమెరికాలోనే మూడో తరగతి చదువుతున్న హృద్య శాస్త్రీయ సంగీతంతో పాటు నృత్యంలోనూ చక్కని ప్రతిభ కనబరుస్తోంది. త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, పంచారామాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా అలరారుతున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆమె సోమవారం గాత్ర కచేరి చేసింది. అనంతరం ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు చిన్నారిని దుశ్శాలువతో సత్కరించి స్వామి జ్ఞాపిక అందజేశారు. పలువురు చిన్నారి హృద్యను అభినందించారు.

శ్రీవరప్రకాష్‌కు చైర్‌పర్సన్ పరామర్శ

కపిలేశ్వరపురం: భార్య వియోగంతో బాధపడుతున్న మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌ను సోమవారం ప్రస్తుత చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. శ్రీవరప్రకాష్ సతీమణి సరిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఆమె మృతికి చైర్‌పర్సన్ నూక దుర్గారాణి సంతాపం వ్యక్తం చేస్తూ నివాళి అర్పించారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వ్యక్తికి గాయాలు

ఉప్పలగుప్తం: రోడ్డు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో వాసాలతిప్ప గ్రామానికి చెందిన కర్రి సత్తిబాబు అనే మత్స్యకారుడి కాలికి సోమవారం తీవ్రగాయమైంది. చల్లపల్లిలో చెక్కావారి సెంటర్ నుంచి వాసాలతిప్ప గ్రామానికి 1.2 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణం, రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ రిటైనింగ్ వాల్‌ను నిర్మించి పనులను సగంలో వదిలేయడం, వాసాలతిప్ప డ్రెయిన్ ప్రాంతం నుంచి మట్టిని అక్రమంగా తరలించడంతో రోడ్డు ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. రోడ్డుపై మట్టి ఎక్కువగా ఉండడంతో సోమవారం కురిసిన వర్షానికి బైక్‌పై ప్రయాణించేవారు పదుల సంఖ్యలో జారి పడిపోయారని, సత్తిబాబు కాలికి తీవ్ర గాయమయిందని గ్రామస్తులు తెలిపారు.

అనారోగ్యంతో మృతి



పువ్వల వెంకటరమణ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వెంకటాయపాలెం శిరోముండనం కేసు బాధితుల్లో ఒకడైన పువ్వల వెంకటరమణ (49) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు సోమవారం తెలిపారు. వెంకట రమణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఏడాది కిందట తల్లి కిడ్నీని వైద్యులు అతడికి అమర్చారు. వెంకటరమణ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

మహిళను రక్షించిన యువకులు

యానాం: యానాం–ఎదుర్లంక బాలయోగి వారధి పై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను సోమవారం స్థానిక యువకులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. మండపేట గ్రామానికి చెందిన మహిళను బీచ్ ప్రాంతంలో ఉన్న గొర్రెల వీరబాబు, మిగిలిన యువకులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఆమెకు భోజనం పెట్టి, ధైర్యం చెప్పి అనంతరం యానాం పోలీసులకు అప్పగించారు.

యూడీసీ పరీక్ష కీ విడుదల

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న యూడీసీ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన పోటీ పరీక్ష కీ ని సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌శాఖ విడుదల చేసింది. ప్రశ్నలను చాలెంజ్ చేయాలని భావిస్తే డీపీఅండ్ఆర్ ఎగ్జామ్ సెల్ ఈ-మెయిల్ ఐడీ 'డీపీఏఆర్-ఎగ్జామ్ ఎట్‌ది రేట్ ఆఫ్ పీవై.జీఓవీ.ఇన్‌కు ఈనెల 25లోగా పంపాలని కోరారు. అటువంటి క్లయిమ్స్‌ను స్క్రూటినీ చేసి తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారన్నారు. పూర్తి ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫలితాలను వెల్లడిస్తారన్నారు.

నష్టపరిహారం జాబితా విడుదల

యానాం: సముద్రంలో ఓఎన్‌జీసీ సంస్థ గ్యాస్‌పైపులైను వేస్తున్న నేపథ్యంలో నష్టపోతున్న మత్స్యకారులకు ఇచ్చే నష్టపరిహారం జాబితా విడుదలయిందని, దానిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 10 రోజుల్లో తెలపాలని సోమవారం యానాం మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 2022–23 సంవత్సరానికి గాను లబ్ధిదారుల జాబితా సర్వేకు సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం విలేజ్ లెవెల్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ అన్ని గ్రామాల్లోను పర్యటించి సర్వే చేసి 1150 మంది అర్హులను గుర్తించి జాబితాను ప్రతి మత్స్యకార గ్రామ కమ్యూనిటీ హాలు, మత్స్యశాఖ ఆఫీసులో ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాలను రాతపూర్వకంగా ఆగస్టు 2లోగా తెలపాలని కోరారు.

వైఎస్సార్ పార్కు అభివృద్ధికి శంకుస్థాపన

మండపేట: పట్టణాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పతివాడ నూక దుర్గారాణి, కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబు అన్నారు. రూ.40 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే స్థానిక వైఎస్సార్ పార్కు సుందరీకరణ పనులకు సోమవారం వారిద్దరూ శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నేత తోట పృథ్వీ రాజ్ పాల్గొన్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పార్కు సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. రెడ్డి రాజాబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీఎంగానూ, బిక్కిన కృష్ణార్జున చౌదరి ఎమ్మెల్యేగానూ ఉన్నకాలంలో పార్క్ నిర్మాణం జరిగిందన్నారు. దీర్ఘకాలంగా పార్క్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిల్ హయాంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కౌన్సిల్ సభ్యుల చొరవతో పార్క్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తోట పృథ్వీరాజ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మండపేట పట్టణం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వార్డు కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి సత్యం, పోతంశెట్టి ప్రసాద్, మారిశెట్టి సత్యనారాయణ, కాసిన కాశీ విశ్వనాథం, వార్డ్ ఇంచార్జ్ గోరు అన్నవరం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు

తగ్గుతూ.. పెరుగుతూ...

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో గోదావరి ఉధృతి తగ్గుతూ.. పెరుగుతూ ఉంది. ఆదివారం సాయంత్రంతో పోలిస్తే సోమవారం సాయంత్రానికి అడుగు మేరకు వరద ఉధృతి పెరిగింది. గోదావరి ఉధృతి కారణంగా గత నాలుగు రోజులుగా ఇప్పటికే పంటు ప్రయాణం నిలిచిపోయింది. దీంతో పాటు లంక పొలాల్లో ఉన్న పశువులను రైతులు గట్టుకు తరలించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరగడంతో మిగులు జలాలను సోమవారం కూడా సముద్రంలోకి వదలడంతో కోటిపల్లిలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం రేవులోని పుష్కర ఘాట్ మెట్లు మొదటి వరస వరకు మునిగి ప్రవహిస్తుంది. రాత్రికి మరింత గోదావరి ఉధృతి పెరిగితే స్థానికంగా ఉన్న మత్స్యకార కాలనీ నీట మునుగుతుంది. మరోవైపు గోదావరి మధ్యలో ఉన్న శేరిలంక గ్రామంలోని భూమి గోదావరి ఉధృతికి కొట్టుకుపోతోంది.



కోటిపల్లి రేవు వద్ద పుష్కరఘాట్ మెట్లు మునిగి ప్రవహిస్తున్న గోదావరి

ధ్రువపత్రాల అవస్థలు సురక్షతో మాయం

మంత్రి వేణుగోపాలకృష్ణ



జగనన్న సురక్ష సభలో ధ్రువపత్రాలను అందిస్తున్న మంత్రి వేణు తదితరులు

రామచంద్రపురం: పౌరులు తమకు అవసరమైన ధ్రువపత్రాల కోసం తిరగాల్సిన అవసరం లేకుండా సురక్షతో సులభంగా పొందడమే జగనన్న సురక్ష ధ్యేయమని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 11వ సచివాలయం పరిధిలో 26, 27 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి వేణు మాట్లాడుతూ తమకు కావాల్సిన ధ్రువపత్రాల కొరకు వలంటీరు ద్వారా అర్జీని అందజేస్తే మూడు రోజుల్లో ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేకుండా ఇంటి వద్దకే అందించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వినూత్నంగా జరుగుతున్న ఈ కార్యక్రమంతో పౌరులు తమకు కావాల్సిన ధ్రువపత్రాలను ఇంటివద్దే అందుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రతిష్టాత్మకమైన జగనన్నకు చెబుదాం అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమం ఒకటని మంత్రి వివరించారు. సీఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా తనదైన శైలిలో మేనిఫెస్టోను తీసుకువచ్చి ప్రణాళికబద్ధంగా అమలు పరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ విధానాన్ని దేశం మొత్తం గ్రహిస్తుందని తెలిపారు. సచివాలయ వ్యవస్థకు తోడుగా వలంటీర్ల ద్వారా నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు బొక్కా సత్యనారాయణ, మేడిశెట్టి కృష్ణవేణి, కట్టా శ్రీరాములు, కోఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ, కమిషనర్ కె శ్రీకాంత్ రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కొండేపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని దంగేరు, మసకపల్లి గ్రామాల్లో సోమవారాం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 11 రకాల ధ్రువపత్రాలు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా పొందొచ్చన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని దీని భాగంగానే జగనన్న సురక్షను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు పిల్లి అన్నపూర్ణ , కొపిశెట్టి రమణ, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, కన్వీనర్లు కాదా గోవిందు, పిల్లి కళ్యాణ్, తహసీల్దార్ వైద్యనాథశర్మ, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, కార్యదర్శులు రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి

కపిలేశ్వరపురం: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎమ్మెల్సీ తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. కపిలేశ్వరపురంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబులతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పసలపూడిలో..

రాయవరం: మండలంలోని పసలపూడి-2 గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కపిలేశ్వరపురం గ్రామ సభలో ప్రజాప్రతినిధులు, అధికారులు



మసకపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

వర్షం.. జనజీవన చిత్రం



పచ్చి ఇటుక తడవకుండా ప్లాస్టిక్ బరకాలు కప్పిన బట్టీ యజమానులు



బరకాలు కప్పకుని వరినాట్లు వేస్తున్న కూలీలు

రాయవరం: అల్పపీడనం ప్రభావంతో ఐదారు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరట కలిగిస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఆగకుండా వర్షం కురుస్తూనే ఉంది. మరీ అంత భారీ వర్షం కాకపోవడంతో జనజీవనానికి అంతగా ఇబ్బంది కలగలేదు. ఆగకుండా.. ఒక పక్క వర్షం కురుస్తున్నా..వ్యవసాయ పనులను రైతులు ఆపలేదు. వ్యవసాయ పనులు చేసుకునే వారు, అత్యవసర పనులపై బయటకు వెళ్లేవారు..వర్షానికి తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు చేశఋరు. వర్షాలకు ఇటుక బట్టీలు ముసుగేసుకున్నాయి. పచ్చి ఇటుకలు తడవకుండా బట్టీ యజమానులు బరకాలు కప్పి వాటిని కాపాడుకునే ప్రయత్నం చేశారు. వర్షాలకు పలు రోడ్లు జలమయంగా, బురదమయంగా మారాయి.

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అల్పపీడన ప్రభావంతో ఏకధాటిగా జోరువాన కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. రోజంతా వర్షం పడడం వల్ల భట్లపాలిక, కోట, కె.గంగవరం, అద్దంపల్లి తదితర గ్రామాల్లోని పల్లపు వీధులు జలమయమయ్యాయి. ఏకధాటిగా వర్షం కురవడంతో జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఉదయం నుంచి వర్షం కురవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో ప్రధాన కాలువలు టేకి డ్రైన్, రాజుకాలువ, పాణింగపల్లి పాత కాలువలు వర్షపునీటితో పరిధి దాటి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పల్లపు భూములున్న అముజూరు, కోటిపల్లి, పేకేరు, భట్లపాలిక తదితర గ్రామాల్లోని నారుమడులు నీట మునిగాయి. తొలకరి పనులు ఏకధాటి వర్షం కారణంగా కొంత వరకు వాయిదా పడ్డాయి.



కె.గంగవరంలో జోరుగా కురుస్తున్న వర్షం

కాజులూరు: మండల గ్రామాల్లో జోరువాన కురిసింది. గత రెండు రోజుల నుంచి చెదురుమదురుగా వర్షపు జల్లులు పడుతుండగా సోమవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు వీలులేక జనజీవనం దాదాపు స్తంభించింది. కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం చెరువుగట్టు సెంటర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోయి రోడ్డు మునగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండల గ్రామాల్లో ప్రస్తుతం పలువురు రైతులు నాట్లు వేసే పనిలో ఉండగా పలువురు రైతులు నారుమడులు, వెదజల్లు చేస్తున్నారు. కాలువ శివారు భూములకు సాగునీరందక తడి ఆరిపోతున్న తరుణంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నాట్లు వేసిన పొలాలకు ఎంతో మేలు చేస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు.



గొల్లపాలెంలో జలమయమైన కాకినాడ, కోటిపల్లి రహదారి

రామచంద్రపురం రూరల్: తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని వానతో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో జన జీవనం స్తంభించింది. ముఖ్యంగా 50 గ్రామాలకు ముఖ్య కూడలిగా ఉంటూ ప్రతి సోమవారం సంత జరుగుతుండటంతో ద్రాక్షారామ మార్కెట్‌కు వచ్చే జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. కానీ వర్షం కురుస్తూనే ఉండటంతో ప్రజల ప్రయాణాలు, వ్యాపారాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిర్మాణ కార్యకలాపాలు నిలిచిపోవడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. మొత్తం మీద ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం ఆగకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

కాటన్ గొప్ప వైజ్ఞానికుడు

పలు గ్రామాల్లో కాటన్ వర్ధంతి

మండపేట: సర్ ఆర్థర్ కాటన్ గొప్ప వైజ్ఞానికుడని ఆయన వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలన్నారు.మండలంలోని పాలతోడులోని పంట కాలువ బల్లకట్టు వద్ద గల కాటన్ విగ్రహం వద్ద సోమవారం అపర భగీరథుని వర్ధంతి నిర్వహించారు. సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, అరవరాజు దంపతులు, రైతులు పూలమాలలు వేసి కాటన్‌కు ఘన నివాళులర్పించారు. సాగునీటి సరఫరా లక్ష్యాన్ని కాటన్ విజయవంతంగా నెరవేర్చారన్నారు. రైతులు మందపల్లి ముసలయ్య, బొక్కా సత్యనారాయణ, యేలేటి ఆనంద రాజులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిమ్మలపూడి వీరన్న చౌదరి, అన్నందేవుల గోపాలరావు, యేలేటి వెంకట్రావు, పిల్లా నాగేశ్వరరావు, బోళ్ల సుబ్బారావు, అన్నందేవుల వెంకటేశ్వర రావు, యేలేటి ఆనంద రావు, సుబ్బి వీరన్న, తుమ్మా వెంకన్న, టెంకాని సత్తిరాజు, రేగులబంద పుల్లయ్య పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో...

మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి , వల్లూరు గ్రామాల్లో కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి రైతులు నివాళులర్పించారు. ఉభయ గోదావరి జిల్లాలు సస్యశ్యామలం కావడానికి కాటన్ సేవలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు.

కాటన్ కీర్తి ప్రతిష్టలు మరువలేనివి

కాజులూరు : ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని కీర్తి ప్రతిష్టలు ఎన్నటికి మరువలేనివని దుగ్గుదుర్రు పీఏసీఎస్ చైర్మన్ రేవుళ్ళ చిట్టియ్యదొర అన్నారు. మండలంలోని దుగ్గుదుర్రులో అమలాపురం పార్లమెంటరీ శెట్టిబలిజ సంక్షేమసంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో సోమవారం కాటన్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాల్లో బీడు భూములకు సాగు నీరందించిన సర్ ఆర్థర్ కాటన్ అపర భగీరథుడిగా, గోదావరి జిల్లాల అన్నదాతగా గుర్తింపు పొందారన్నారు. కాటన్ విగ్రహానికి నాయకులు, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాలతోడులో కాటన్‌దొరకు నివాళి అర్పిస్తున్న నాయకులు



దుగ్గుదుర్రులో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, రైతులు

పీర్ల పంజాను సందర్శించిన పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: స్థానిక పీర్ల పంజాను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ సోమవారం సందర్శించారు. మొహర్రం సందర్భంగా పీర్ల పంజా వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇస్లాం మానవ జీవన విధానానికి మార్గదర్శి అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, నాయకులు చింతా పెద్ద కాపు, కుడిపూడి విజయ్, గుత్తి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.